ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 01.07.2024 సమయం: 1310 గంటలు

ముఖ్యాంశాలు

1. విద్యుత్ కొనగోళ్ల అవకతవకలపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిషన్ చెల్లుబాటుపై బిఆర్ఎస్ పార్టీ అధినేత చంద్రశేఖరరావు దాఖలు చేసిన పిటిషన్ ను హైకోర్టు కొట్టి వేసింది.
2. ఖమ్మం జిల్లా మధిరలో ఐటి హబ్ ఏర్పాటు చేయనున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు.
3. 2024 నీట్ మళ్లీ నిర్వహించిన పరీక్ష ఫలితాలను ఎన్టిఏ విడుదల చేసింది. దీంతో పాటు నీట్ యూజీ 2024 అభ్యర్థులందరి ర్యాంకులు సవరించినట్లు వెల్లడించింది.
4. న్యాయ వ్యవస్థలో కీలక మార్పులు చేస్తూ కేంద్ర ప్రభుత్వం తెచ్చిన కొత్త క్రిమినల్ చట్టాలు ఈరోజు నుంచి దేశ వ్యాప్తంగా అమలులోకి వచ్చాయి.

KCR – HIGH COURT

విద్యుత్ కొనుగోళ్ల అవకతవకలపై  రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ L నరసింహారెడ్డి కమిషన్ చెల్లుబాటుపై రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, BRS పార్టీ అధినేత చంద్రశేఖర్ రావు దాఖలు చేసిన పిటిషన్ ను హై కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ ఆరాధే నేతృత్వంలోని ధర్మాసనం కొట్టి వేసింది. విద్యుత్ కొనుగోళ్ళపై వచ్చిన ఆరోపణలను కమిషన్ విచారించవచ్చని స్పష్టం చేసింది. గత ప్రభుత్వంలో  విద్యుత్ కొనుగోళ్ల అవకతవకలు జరిగాయని వచ్చిన ఆరోపణలపై రాష్ట్ర ప్రభుత్వం జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి నేతృత్వంలో విచారణ సంఘాన్ని ఏర్పాటు చేసింది.  కమిషన్ ఇప్పటికే మాజీ ముఖ్యమంత్రికి రెండు సార్లు నోటీసులు ఇచ్చి విద్యుత్ కొనుగోళ్ళపై వివరణ కోరింది. అయితే అసలు కమిషన్ ఏర్పాటు సరికాదని, అవకతవకలు జరిగాయని ముందుగానే నిర్ణయానికి వచ్చి తనకు నోటీసులు ఇవ్వటం సరికాదని చంద్రశేఖరరావు కమిషన్ కు లేఖ వ్రాశారు. జస్టిస్ L నరసింహారెడ్డి తనంత తానుగా కమిషన్ నుంచి తప్పుకోవాలని కూడా ఆయన డిమాండ్ చేశారు.

(MSL)

KMM- BHATTI

ఖమ్మం జిల్లా మధిరలో software ఉద్యోగావకాశాలను కల్పించే ఉద్దేశ్యంలో ఐటి హబ్ ఏర్పాటు చేయనున్నట్లు  ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. ఈరోజు మధిర లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మధిర ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నట్లు ప్రకటించారు. మధిర లో పాఠశాల, జూనియర్ కళాశాలకు నూతన భవనాలను నిర్మించనున్నట్లు భట్టి పేర్కొన్నారు. సిరిపురం వద్ద ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు  వచ్చేవారం శంకుస్థాపన చేయబోతున్నామన్నారు. మధిరలో ప్రజల స్వచ్ఛంద సహకారంతో  రహదారుల విస్తరణకు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం పెనుగొలను - సిద్దినేని గూడెం వరకు 2 కోట్ల 75 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న బిటి రోడ్డు కు శంకుస్తాపన చేశారు.

(PTC)

దామోదర రాజా నరసింహ- వైద్య మౌలిక సదుపాయాలు

రాష్ట్రంలో ప్రధాన ఆసుపత్రులు- ఉస్మానియా, గాంధీ, కాకతీయ వైద్య కళాశాలల హాస్టల్ భవనాలకు పది రోజుల్లో శంకుస్థాపన చేయనున్నట్లు ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనరసింహ చెప్పారు. కొద్ది రోజుల క్రితం జూనియర్ డాక్టర్లకు ఇచ్చిన హామీ మేరకు .... రెండేళ్ళలో వీటి నిర్మాణాన్ని పూర్తి చేస్తామని పేర్కొన్నారు. హైదరాబాద్ లో ఈ ఉదయం మంత్రి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... 80 శాతం మేర జూనియర్ డాక్టర్ల డిమాండ్లను పూర్తి చేసినట్లు చెప్పారు. నీట్ పరీక్షను రద్దు చేయాలా, పరీక్షను కేంద్ర ప్రభుత్వమే నిర్వహించాలా, లేక రాష్ట్రాలకు అప్పగించాలా వంటి పలు అంశాలపై విస్తృతంగా చర్చ జరగాలని మంత్రి అన్నారు. కొత్త వైద్య కళాశాలల మంజూరుపై కేంద్రాన్ని కోరినట్లు చెప్పిన ఆరోగ్య శాఖ మంత్రి రాష్ట్రానికి మరిన్ని వైద్య కళాశాలలు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

MSL

LOK SABHA

లోక్ సభ నుండి ప్రతి పక్షాలు వాకౌట్ చేశాయి. నీట్ పేపర్ లేకేజీపై చర్చకు ప్రతి పక్షాలు పట్టుబట్టగా స్పీకర్ ఓం బిర్లా అందుకు అంగీకరించలేదు. దీంతో ప్రతిపక్షాలు సభ నుండి బయటికి వచ్చాయి. అంతకు ముందు టీ 20 వరల్డ్ కప్ సాధించిన భారత జట్టుకు లోక్ సభ అభినందనలు తెలిపింది. కాగా, లోక్ సభలో నీట్ పేపర్ లీకేజీ పై చర్చ జరపాలంటూ కాంగ్రెస్ సభ్యుడు కే సీ వేణు గోపాల్ నోటీసు ఇచ్చారు.

(Desk)

CM-గవర్నర్:

రాష్ట్ర గవర్నర్ CP రాధాకృష్ణన్ తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొద్ది సేపటి క్రితం సమావేశం అయ్యారు. శాసనసభ సమావేశాలు, ఇంకా ప్రభుత్వం పరిశీలిస్తున్న కొన్ని కొత్త చట్టాలు, తత్

సంబంధిత అంశాలపై ఇద్దరూ చర్చిస్తున్నట్లు సమాచారం. శాసన మండలి, శాసనసభ లను కొద్ది రోజు ల క్రితం ప్రొరోగ్ చేసిన విషయం తెల్సిందే.

(MSL)

PM message

ఎన్ డి ఏ ప్రభుత్వం దేశంలో ఆరోగ్య మౌళిక సదుపాయాలను మెరుగు పరిచేందుకు కట్టుబడి ఉందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. మన ఆరోగ్యాన్ని రక్షించే హీరోల అంకిత భావాన్ని గౌరవించుకొనేందుకు వైద్యుల దినోత్సవాన్ని నిర్వహిస్తామని ట్వీట్ చేశారు. సవాళ్లతో కూడిన సంక్లిష్టతలను తమ అసాధారణ నైపుణ్యంతో వారు పరిష్కరిస్తారని చెప్పారు. తమ ప్రభుత్వంలో వైద్యులు తగిన గౌరవం పొందేలా భరోసా ఇస్తామన్నారు.

(Tweet)

NEET EXAM RESULTS

నీట్-2024 కోసం 15 వందల మందికి పైగా మళ్ళీ నిర్వహించిన పరీక్ష, రీ-టెస్ట్ ఫలితాలను జాతీయ టెస్టింగ్ సంస్థ తన వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసింది. ఈఫలితాలతో పాటూ, అభ్యర్థులందరి ర్యాంకులను తిరిగి లెక్కించి .. ఆ ర్యాంకులనూ వెబ్ సైట్ లో ఉంచినట్లు NTA ప్రకటించింది. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు జూన్ 23న 1563 మంది అభ్యర్థుల కోసం రీ-టెస్ట్ నిర్వహించగా, 813 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వీరి జవాబు పత్రాలు, ప్రొవిజనల్- కీ ని ఇప్పటికే వెబ్ సైట్ లో ఉంచిన విషయం తెల్సిందే. నిర్దేశించిన అన్ని ప్రక్రియలను అనుసరించిన తర్వాత నీట్ 2024 (అండర్ గ్రాడ్యుయేట్) సవరించిన స్కోర్ కార్డులను వెబ్ సైట్ లో ఉంచినట్లు, అభ్యర్థులు వీటిని వెబ్ సైట్ నుంచి డౌన్ లోడ్ పొందవచ్చని NAT వెల్లడించింది.

(MSL)

NEW CRIMINAL

న్యాయ వ్యవస్థలో కీలక మార్పులను తీసుకువస్తూ నరేంద్ర మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త క్రిమినల్ చట్టాలు ఈరోజు నుంచి దేశవ్యాప్తంగా అమలులోకి వచ్చాయి. ఇండియన్ పీనల్ కోడ్, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ స్థానంలో భారతీయ న్యాయ సంహిత,

భారతీయ నాగరిక్ సురక్షా సంహిత, భారతీయ సాక్ష్యా అధినియం చట్టాలు నేటి నుండి దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చాయి. ఈ మార్పులతో జీరో ఎఫ్ఐఆర్, ఆన్‌లైన్‌లో పోలీసులకు ఫిర్యాదు, ఎస్ఎంఎస్ వంటి ఎలక్ట్రానిక్ మోడ్‌ల ద్వారా సమన్లు జారీ చేయడం, క్రూరమైన నేరాలకు సంబంధించిన నేర దృశ్యాలను తప్పనిసరిగా వీడియోగ్రఫీ చేయడం వంటి నిబంధనలు అమల్లోకి వచ్చాయి. ఉగ్రవాదానికి స్పష్టమైన నిర్వచనం ఇవ్వటమే కాకుండా రాజద్రోహం పదాన్ని తొలగించారు. భారతీయ న్యాయ సంహితలో రాజద్రోహం స్థానంలో దేశద్రోహం అనే కొత్త పదాన్ని చేర్చారు. రాజ్యాంగ ఆదర్శాలను దృష్టిలో ఉంచుకుని ప్రస్తుత సమాజంలో నేరాలను త్వరగా పరిష్కరించేందుకు ఈ మార్పులు దోహద డతాయని కేంద్ర ప్రభుత్వ అధికారిక వర్గాలు వెల్లడించాయి.

(Desk)

NLG – NEW ACTS

కేంద్రప్రభుత్వం కొత్తగా ప్రవేశ పెట్టిన పోలీసు చట్టాలు జిల్లాలో నేటి నుంచి పూర్తి స్థాయిలో అమలులోకి వచ్చాయని నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్రపవార్ తెలిపారు. ఈ కొత్త చట్టాలపై ప్రజలు, పోలీసులు, న్యాయవాదులు పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని కోరారు. కొత్త చట్టాలపై పోలీసు సిబ్బందికి అవగాహన కల్పించేందుకు జిల్లా వ్యాప్తంగా కానిస్టేబుళ్ళ నుంచి డీఎస్పీ స్థాయి అధికారి వరకు 18బ్యాచులలో 875మందికి శిక్షణ పూర్తి చేశామని అన్నారు. ఈ చట్టాల ద్వారా బాధితులకు న్యాయం కలిగేలా చేస్తూ, నేరస్థులకు శిక్షలు, జరిమానాలు పెరగడంతో పాటు కొత్తగా టెర్రరిస్టు చట్టం 113 వంటివి అమలులోకి వచ్చాయని అన్నారు.

(PTC)

TS RAINS

రాష్ట్రంలో ఇవాళ, రేపు పలు చోట్ల పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతవరణ శాఖ పేర్కొంది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో బలమైన ఈదురుగాలులతో కూడిన వర్షాలు

కురుస్తాయని తెలిపింది. కాగా నిన్న రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురిశాయి. అత్యధికంగా తాండూరులో 5.1 సెంటీమీటర్లు, నిజామాబాద్ లోని పోతంగల్ లో 4.8 సెంటీమీట్ల వర్షపాతం నమోదయిందని వెల్లడించింది. ఈరోజు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఆకాశం మేఘావృతమై ఉంటుందని, పలు చోట్ల వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది.

(PN)

SIRICILLA

వరద ముంపు ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందులు కలగని విధంగా పకడ్బందీ చర్యలు చేపట్టాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మున్సిపల్ అధికారులను ఆదేశించారు. వర్షాకాలం నేపథ్యంలో సిరిసిల్ల పట్టణంలోని లోని శ్రీ నగర్ కాలనీ, శాంతి నగర్, పద్మనగర్ లో మున్సిపల్ కమిషనర్ లావణ్య తో కలిసి కలెక్టర్ పర్యటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..ముంపు ప్రాంతాల్లో ఖచ్చితమైన ప్రణాళికతో పనులు చేపట్టాలని ఆదేశించారు.

(PTC)

GANJA

గంజాయి, మాదక ద్రవ్యాలు విరివిగా లభ్యం కావడాన్ని అరికట్టాలని, విద్యార్థులు, యువత భవిష్యత్ ను పరిరక్షించే దిశగా కట్టు దిట్టమైన చర్యలు తీసుకోవాలని BRS శాసనసభ్యులు KP వివేకానంద రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ఆయన లేఖ రాశారు.

(MSL)

MEDAK - PRAJAVAAANI

మెదక్ జిల్లా సమీకృత కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుండి నేరుగా దరఖాస్తులు స్వీకరించారు. ప్రజల నుండి వచ్చిన అర్జీలను పరిశీలించి సత్వరం పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

(PTC)